క్లుప్తంగా

ఘనంగా వేణుగోపాలస్వామి గ్రామోత్సవం



బలభద్రపురంలో ఊరేగుతున్న స్వామివారు

బిక్కవోలు: బలభద్రపురం గ్రామంలోని రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి గ్రామోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ప్రతి ఏటా కనుమ పండగ రోజు ఈ కార్యక్రమం నిర్వహించడం ఆనవాయితీ. మాజీ సర్పంచ్ సత్తి సత్యనారాయణరెడ్డి కుటుంబ సభ్యులు ఈ గరుడ వాహనాన్ని స్వామి వారి దేవాలయానికి అందజేశారు. ఈ నేపథ్యంలో ఆ రథాన్ని అలంకరించి, పూజల అనంతరం స్వామివారి గ్రామోత్సవం వైభవంగా జరిపారు. సత్తి వీర వెంకట దొర ప్రసాద్ రెడ్డి, సీతా మహాలక్ష్మి దంపతులు, మల్లిడి కృష్ణారెడ్డి దంపతులు పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విశేషంగా భక్తులు పాల్గొన్నారు.

అలరించిన కూచిపూడి నృత్యం



నృత్య ప్రదర్శన చేస్తున్న చిన్నారులు

రంగంపేట: సింగంపల్లి గ్రామదేవత భీలాలమ్మ అమ్మవారి జాతర సందర్భంగా బుధవారం రాత్రి బిక్కవోలుకు చెందిన కూచిపూడి కళాధామం చిన్నారులు కూచిపూడి నృత్యం ప్రదర్శించారు. అనంతరం గురువు జాహ్నవి, చిన్నారులను ఉత్సవ కమిటీ సభ్యులు జ్ఞాపికలు అందించి సత్కరించారు.

వ్యక్తిపై దాడి

సీతానగరం: చెప్పుల దుకాణదారుడిని గాయపర్చిన ఇద్దరిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై డి.రామ్‌కుమార్ బుధవారం తెలిపిన వివరాల ప్రకారం.. చినకొండేపూడిలో నకుల శ్రీకాంత్ చెప్పుల దుకాణం నిర్వహిస్తున్నాడు. ఆ షాపు వద్దకు మంగళవారం రాత్రి 6 గంటల సమయంలో ఇద్దరు వ్యక్తులు వచ్చారు. దుకాణంలో ఉన్న శ్రీకాంత్ భార్యను దుర్భాషలాడారు. ప్రశ్నించిన శ్రీకాంత్‌పై దాడి చేసి అతడి తీవ్రంగా కొట్టారు. ఈ ఘర్షణలో శ్రీకాంత్ చెయ్యి విరగడంతో రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆసుపత్రి సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వినాయకునికి పూజలు



ప్రత్యేక అలంకరణలో సిద్ధి వినాయకుడు

పెదపూడి: సంపర గ్రామంలోని పంట కాలువ సమీపంలో కొలువైన సిద్ధి వినాయకునికి బుధవారం పంచామృతాభిషేకం, గరిక పూజలు నిర్వహించారు. స్వామివారికి అర్చకుడు ఖండవిల్లి హనుమంతాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

సంప్రదాయబద్ధంగా పండగ జరుపుకోవాలి



పురుషోత్తపట్నంలో ముగ్గులను పరిశీలిస్తున్న పరమహంస తదితరులు

సీతానగరం: ప్రతి ఒక్కరూ సంప్రదాయబద్ధంగా సంక్రాంతి పండగ జరుపుకోవాలని బెంగళూరులోని ఏఎంసీ విద్యాసంస్థల అధినేత కల్లూరి రామకృష్ణ పరమహంస, గీత దంపతులు అన్నారు. పురుషోత్తపట్నంలో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. రామకృష్ణ పరమహంస ప్రతి ఏడాదీ తన పుట్టిన ఊరైన పురుషోత్తపట్నానికి కుటుంబ సభ్యులతో వచ్చి, పండగను జరుపుకోవడం పరిపాటి. ఈ నేపథ్యంలో మంగళవారం రామకృష్ణ పరమహంస, గీత దంపతుల భోగిమంటలు వెలిగించి వేడుకలు ప్రారంభించారు. ముగ్గుల పోటీలు, సంప్రదాయ వస్త్రధారణతో ఫ్యాషన్ షో, కోలాటం, నృత్యరూపకాలు నిర్వహించారు. కనుమ సందర్భంగా బుధవారం కల్లూరి పరమహంస ఫౌండేషన్ ఆధ్వర్యంలో 200 మంది వృద్ధులకు ఒక్కొక్కరికీ రూ.400 చొప్పున పింఛన్, నూతన వస్త్రాలను అందించారు.

పోటాపోటీగా పందేలు

- తలపడిన కోడి పుంజులు
- యథేచ్ఛగా నిర్వహణ
- జోరుగా గుండాట
- చేతులు మారిన కోట్ల రూపాయలు

రాజానగరం: సంక్రాంతిని పురస్కరించుకుని అనపర్తి, రాజానగరం నియోజకవర్గాల్లో కోడి పందేలు యథేచ్ఛగా జరిగాయి. ఊరూరా బరులు ఏర్పాటు చేసి, రాత్రీ పగలు అనే తేడా లేకుండా పందేలు నిర్వహించారు. ఎల్‌ఈడీ బల్బుల సెట్టింగ్, విపరీతంగా వచ్చిన జనాలతో జాతరను తలపించాయి. మూడు రోజుల్లో కోట్ల రూపాయలు చేతులు మారాయి. వీటి వద్దే గుండాట తదితర జూదాలు జోరుగా కొనసాగాయి. రాజానగరం నియోజకవర్గంలోని శ్రీరామపురం, పుణ్యక్షేత్రం, దివాన్‌చెరువు, పాలచర్ల, నరేంద్రపురం, ముక్కినాడపాకలు, జియ్యరంపాలెం, శ్రీకృష్ణపట్నం, కోరుకొండ మండలం గాదరాడ, కోరుకొండ, బూరుగుపూడి, దోసకాయలపల్లి, నిడిగట్ల, సీతానగరం మండలం పెదకొండేపూడి, నాగంపల్లి, మిర్తిపాడు, రూరల్ పరిధిలోని తొర్రేడు ఏరియాలలోని తోటలలో కోడి పందేలు జోరుగా సాగాయి.

విచ్చలవిడిగా..

మధురపూడి: కోరుకొండ మండలంలో కోడి పందేలు యథేచ్ఛగా జరిగాయి. కోటి గ్రామంలో విజేతకు బుల్లెట్ మోటారు సైకిల్‌ను బహుమతిగా అందించారు. కోడిపందేలతో పాటు గుండాట కూడా జోరుగా సాగింది. బరుల వద్దే మద్యం షాపులను ఏర్పాటు చేసిన విక్రయాలు జరిపారు.

బిక్కవోలు మండలంలో..

బిక్కవోలు: తెలుగు ప్రజల పెద్ద పండగ సంక్రాంతి వేడుకలు మండలంలోని ప్రతి ఇంటా ఉత్సాహంగా జరిగాయి. సంక్రాంతి రోజు ప్రత్యేక పూజలు చేసి పితృదేవతలకు నైవేద్యాలు సమర్పించి, పిండి వంటలు చేసుకుని, పిల్లా పాపలతో సరదాగా గడిపారు. చిన్నారులు వివిధ వేషధారణలు, యువతులు సంప్రదాయ ఆటలతో సందడి చేశారు. అలాగే మూడు రోజులుగా మండలంలోని కోడి పందేలు, గుండాట యథేచ్ఛగా జరిగాయి. కొన్ని గ్రామాల్లో కబడ్డీ వంటి సంప్రదాయ పోటీలు నిర్వహించారు.

ఘనంగా పండగ

సీతానగరం: మండల గ్రామాల్లో కనుమ పండగను బుధవారం ఘనంగా జరుపుకొన్నారు. రైతులు తమ పశువులకు పూజలు నిర్వహించారు. అమ్మవార్లకు నైవేద్యాలు సమర్పించారు.



శ్రీకృష్ణపట్నంలో కోడి పందేల జోరు



శ్రీకృష్ణపట్నంలో నిర్వహిస్తున్న గుండాట



రాఘవపురంలో తలపడుతున్న పుంజులు



కొమరిపాలెంలో కోడిపందేలు



కొంకుదురులో కబడ్డీ పోటీలు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనానికి హాజరైన పూర్వ విద్యార్థులు

బిక్కవోలు: రాయవరం గ్రామంలోని రామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకున్న 1977–78 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు బిక్కవోలు మండలం బలభద్రపురంలోని ఆంధ్రా షిర్డీ సాయి మందిరం వద్ద ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. చదువుకున్న అనంతరం ఉద్యోగం, వ్యాపారం, ఇతర రంగాల్లో వారందరూ స్థిరపడ్డారు. దాదాపు 47 ఏళ్ల తర్వాత మళ్లీ తమ స్నేహితులను కలుసుకున్నారు. వీరిలో కొందరు ఉద్యోగ విరమణ చేశారు. చాలామంది తమ వ్యాపారాలను వారసులకు అప్పగించి మనవళ్లతో కాలక్షేపం చేస్తున్నారు. ఈ బ్యాచ్ లో 120 మంది చదువుకోగా, సుమారు 87 మంది విద్యార్థులు, ఐదుగురు ఉపాధ్యాయులు హాజరయ్యారు. వారి కుటుంబ సభ్యులతో కలిసి సుమారు 500 తరలి వచ్చారు. ఆనాటి మధుర జ్ఞాపకాలను నెమరు వేసుకుని, సందడి చేశారు. మరణించిన తమ ఉపాధ్యాయులు, తోటి స్నేహితులకు ముందుగా నివాళులర్పించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులైన పారిశ్రామికవేత్త కర్రి వెంకట ముకుందారెడ్డి, ఆంధ్రా షిర్డీసాయి ఆలయ వ్యవస్థాపక చైర్మన్ సబ్బెళ్ల వీర వెంకటకృష్ణ పురోషోత్తమరెడ్డి, మేడపాటి ధర్మారెడ్డి, మల్లిడి చెల్లారెడ్డి, గోపాలకృష్ణారెడ్డి, నల్లమిల్లి వెంకటరెడ్డి పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక భావాలు కలిగి ఉండాలి



అనపర్తి బాపనమ్మ ఆలయం వద్ద వస్త్రాలు పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి

పెదపూడి: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావాలు కలిగి ఉండాలని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. అనపర్తిలోని బాపనమ్మ అమ్మవారిని మంగళవారం ఆయన దర్శించుకున్నారు. ఆలయం వద్ద బాపనమ్మ యూత్ అధ్వర్యంలో దివ్యాంగులు, వృద్ధులకు నూతన వస్త్రాలను పంపిణీ చేసి, అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎంపీటీసీ సభ్యుడు కర్రి చిన వెంకటరెడ్డి, మల్లిడి బుల్లి వెంకటరెడ్డి, వీరయ్యకాపు, మల్లిడి వీర్రాఘవరెడ్డి, మల్లిడి అబ్బు, వినోద్ రెడ్డి, కర్రి పెద వెంకట రెడ్డి, సత్తి సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ముగ్గుల పోటీలు



చక్రద్వారబంధంలో ముగ్గుల పోటీ విజేతకు బహుమతి అందిస్తున్న నిర్వాహకులు



ఎస్టీ రాజాపురంలో విజేతకు బహుమతి అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



పెదపూడిలో విజేతకు బహుమతి అందిస్తున్న ఎస్సై రామారావు

రాజానగరం: సంక్రాంతి సంబరాలలో భాగంగా పలు ప్రాంతాలలో ముగ్గుల పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. రాజానగరం మండలం చక్రద్వారబంధంలో సీతారామాంజనేయ బాలభక్త సమాజం ఆధ్వర్యంలో బుధవారం రంగవల్లుల పోటీలు జరిగాయి. రాజానగరం, చక్రద్వారబంధం, వెలుగుబంద, అమలాపురం, కానవరం, నర్సాపురం, రాజమహేంద్రవరం ప్రాంతాల నుంచి వచ్చిన 75 మంది మహిళలు రకరకాల ముగ్గులను పెట్టి పోటీపడ్డారు. మొదటి బహుమతిగా సోడసాని నాగేశ్వరి (కానవరం)కి గ్రైండర్, రెండో బహుమతిగా దాయిన రాజకుమారి (చక్రద్వారబంధం)కి ఎలక్ట్రికల్ స్టవ్, మూడో బహుమతిగా మట్ట పద్మ (నర్సాపురం)కి మిక్సీ, నాలుగో బహుమతిగా వి.ధనలక్ష్మి (రాజానగరం)కి సీలింగ్ ఫ్యాన్, ఐదో బహుమతిగా పంతం సాయిరమ్యకు డబుల్ కుక్కర్, ఆరో బహుమతిగా బొర్ర దుర్గాశ్రీ (అమలాపురం)కి కుక్కర్‌ను అందించారు. పోటీలో పాల్గొన్న వారందరికీ ప్రోత్సాహక బహుమతులుగా కప్పు, సాసర్లను బహూకరించారు.

ఎస్టీ రాజాపురంలో..

రంగంపేట: మండలంలోని ఎస్టీ రాజాపురం గ్రామంలో సర్పంచ్ అడ్డాల పద్మావతి ఆధ్వర్యంలో బుధవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. గ్రామంలోని మహిళలు, యువతులు ఉత్సాహంగా పోటీలో పాల్గొని ముగ్గులను తీర్చిదిద్దారు. విజేతలుగా బి.ఝాన్సీ (ప్రథమ), వాడకట్టు నాగలక్ష్మి (ద్వితీయ), కాళ్ల దుర్గ (తృతీయ) విజేతలుగా నిలిచారు. కార్యక్రమంలోని వైఎస్సార్ సీపీ మండల నాయకులు, జెడ్పీటీసీ పేపకాయల రాంబాబు, జెడ్పీటీసీ కో ఆప్షన్ సభ్యులు లంక చంద్రన్న, రాష్ట్ర కార్యదర్శి కొల్లాటి ఇశ్రాయేలు, వడశలేరు సర్పంచ్ కొల్లాటి శ్యామలావతి, అడ్డాల వెంకటేష్, మండల బూత్ కమిటీ కన్వీనర్ రవి శంకర్, క్రిస్టియన్ సెల్ అధ్యక్షుడు కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

సంప్రదాయాలను కాపాడుకోవాలి

పెదపూడి: సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుకోవాలని ఎస్సై కె.రామారావు, న్యాయవాది కాకర వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక మార్కెట్ సెంటర్‌లో బుధవారం మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా రామారావు, వెంకటేశ్వరరావు, ప్రముఖ వైద్యుడు, ఆధ్యాత్మిక వేత్త చింతపల్లి కామేశ్వరరావు, మండల విద్యాశాఖాధికారి సీవీవీ.సత్యనారాయణ, నూని వీర వెంకట సత్యనారాయణ హాజరయ్యారు. ముగ్గుల పోటీల్లో 60 మంది పాల్గొనగా, వారిలో ఒక్కో విభాగంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలుగా ఎంపిక చేశారు. ప్రతి ఒక్కరికి మొక్కలు అందజేశారు. ఈ సందర్భంగా వెంకట సాయి మెడికల షాపు నిర్వాహకుడు చందవోలు రామకృష్ణ మాట్లాడుతూ గత 15 ఏళ్లుగా ఈ పోటీలను నిర్వహిస్తున్నామన్నారు.

అనపర్తిలో వీరుళ్లమ్మ జాతర ప్రారంభం



అనపర్తిలో వీరుళ్లమ్మ జాతరను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

పెదపూడి: అనపర్తి గ్రామంలో ప్రసిద్ధి చెందిన వీరుళ్లమ్మ జాతర మంగళవారం వైభవంగా మొదలైంది. ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తలపై గరగలను ఎత్తుకుని జాతరను ప్రారంభించారు. ఆయనతో పాటు సతీమణి మహాలక్ష్మి, నల్లమిల్లి మనోజ్ రెడ్డి, గోదావరి తూర్పు డెల్టా ప్రాజెక్ట్ వైస్ చైర్మన్ తమలంపూడి సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు. అలాగే అనపర్తిలో బాపనమ్మ అమ్మవారిని ఎమ్మెల్యే దర్శించుకున్నారు. బాపనమ్మ యూత్ సమకూర్చిన నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. భగవాన్ వెంకన్నస్వామి ఆశ్రమంలో గొలుగూరి వెంకటరెడ్డి ఏర్పాటు చేసిన నూతన వస్త్రాలను వృద్ధులు, మహిళలు, వికలాంగులకు అందజేశారు. అనంతరం అయ్యప్ప స్వామి ఆలయంలో ఆభరణాల అలంకరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనపర్తి మండలం కుతుకూలూరులో సంజీవ్ రెడ్డి, జాజి ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో జరిగిన ముగ్గుల పోటీల విజేతలకు ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి, న్యూఢిల్లీకి చెందిన ఐఆర్ఎస్ జాయింట్ డైరెక్టర్ కర్రి రామ్‌గోపాల్‌రెడ్డి, నల్లమిల్లి మనోజ్‌రెడ్డి పంపిణీ చేశారు. పెదపూడి మండలం పెద్దాడలో దివంగత మాజీ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ బొడ్డు భాస్కర రామారావు జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు నివాళులు అర్పించారు. అలాగే స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో చెత్త వ్యర్థాలను తరలించే ట్రాక్టర్‌ను రుడా చైర్మన్ బొడ్డు అనంత వెంకట రమణ చౌదరితో కలిసి ప్రారంభించారు. అనపర్తి మండలం పొలమూరులో 1975–1980 బ్యాచ్ కుతుకూలూరు జెడ్పీ హైస్కూల్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయికలో పాల్గొన్నారు.

మహిళా కబడ్డీ పోటీల విజేత భీమవరం



విజేత జట్టుకు బహుమతి అందిస్తున్న సర్పంచ్ సత్తి వీరమణి

బిక్కవోలు: సంక్రాంతి సంబరాల్లో భాగంగా కొంకుదురు రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళా కబడ్డీ పోటీల్లో భీమవరం 88 డ్రాగన్ జట్టు విజేతగా నిలిచింది. మూడు రోజులుగా ఈ పోటీలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఫైనల్ మ్యాచ్‌లో రాజమహేంద్రవరంపై భీమవరం విజయకేతనం ఎగురవేసింది. దీంతో రాజమహేంద్రవరం జట్టు రన్నర్‌గా నిలిచింది. పోటీల అనంతరం విన్నర్, రన్నర్ జట్లకు ప్రముఖులు బహుమతులు అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ సత్తి వీరమణి, ఎంపీటీసీ కొంకుదురు పీవీ, నల్లమిల్లి అమ్మిరెడ్డి, కొమరిపాలెం డీసీ చైర్మన్ కొవ్వూరి వేణుగోపాలరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ చింతా శ్రీనివాసరెడ్డి, మాజీ సొసైటీ అధ్యక్షుడు సత్తి నాగిరెడ్డి రాజా, ఎస్వీ సూర్యనారాయణరెడ్డి, సత్తి తాతారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా తిరువాభరణోత్సవం

- నగరంలో భారీ ఊరేగింపు
- ఆకట్టుకున్న వేషధారణలు



తిరువాభరణాలతో జక్కంపూడి రాజా కుటుంబ సభ్యులు

రాజమహేంద్రవరం సిటీ: సంక్రాంతిని పురస్కరించుకుని ధర్మశాస్తా ఆధ్యాత్మిక కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం అయ్యప్ప స్వామి తిరువాభరణోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జక్కంపూడి రాజా, కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ముందుగా ప్రకాశం నగర్‌లోని జక్కంపూడి రామ్మోహనరావు నివాసంలో అయ్యప్ప స్వామి, అమ్మవారి తిరువాభరణాలకు గురుస్వాముల పర్యవేక్షణలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కొత్తపల్లి భుజంగరాయులు, కొత్తపల్లి రామ్ వివాస్ సుబ్బారాయుడు, కొమ్ముల సాయిలు శ్రీ తదితరులు ఆభరణాలను శిరస్సున ధరించి ఊరేగింపుగా బయలుదేరారు. కేరళ వాయిద్యాలు, కోలాటం, డోలు సన్నాయి, మేళతాళాలు, విచిత్ర వేషధారణల నడుమ టీటీడీ కల్యాణ మండపం, కంబాల చెరువు, దేవీచౌక్, మెయిన్ రోడ్డు, డీలక్స్ సెంటర్, విశ్వేశ్వర స్వామి ఆలయం మీదుగా అయ్యప్ప స్వామి ఆలయానికి చేరుకుని, స్వామివారి ఆభరణాలను పూజారులకు అందజేశారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకుడు నంబుద్రి సమక్షంలో ప్రత్యేక పూజలు జరిపి, స్వామివారికి తిరువాభరణాలను అలంకరణ చేశారు.

శబరిమల తరహాలో పూజలు

జక్కంపూడి రాజా మాట్లాడుతూ తన తండ్రి, మాజీ మంత్రి జక్కంపూడి రామ్మోహనరావు ధర్మశాస్తా ఆధ్యాత్మిక కేంద్రం అనే ట్రస్టును ఏర్పాటు చేసి, రాజమహేంద్రవరంలో శబరిమల ఆలయాన్ని పోలిన అయ్యప్ప స్వామి గుడిని నిర్మించారన్నారు. మన రాష్ట్రంతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి అనేక మంది భక్తులు ఇక్కడకు వచ్చి స్వామివారి దీక్ష విరమణ చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో జక్కంపూడి విజయలక్ష్మి, డీసీసీబీ మాజీ చైర్మన్ ఆకుల వీర్రాజు, హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మపర్సన్ మేడపాటి షర్మిలా రెడ్డి, ఆర్యాపురం బ్యాంక్ చైర్మన్ చల్లా శంకర్రావు, రాష్ట్ర పచ్చదనం, సుందరీకరణ కార్పొరేషన్ మాజీ చైర్మన్ చందన నాగేశ్వర్, నందెపు శ్రీనివాస్, తోట సుబ్బారావు, పాలసాన పల్లి హనుమంతరావు, మంతెన కేశవరాజు, ఇసుకపల్లి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.



ఆకట్టుకున్న వేంకటేశ్వరస్వామి వేషధారణ



కోలాటం ఆడుతున్న చిన్నారులు, మహిళలు



కేరళ వాయిద్యాల సందడి

సినీ నటుడు శోభన్ బాబుకు నివాళి



శోభన్ బాబు విగ్రహానికి పుష్పాంజలి ఘటిస్తున్న అభిమానులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): సినీనటుడు శోభన్ బాబు జయంత్యుత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. గోదావరి బండ్ రోడ్డులోని ఆయన విగ్రహానికి అఖిల భారత శోభన్ బాబు సేవా సమితి ఆధ్వర్యంలో పూలమాలలు వేసి, నివాళులర్పించారు. సేవా సమితి గౌరవ అధ్యక్షుడు అల్లు బాబీ, సలహాదారు బళ్లా శ్రీనివాసరావు, అధ్యక్షుడు కొనకళ్ల శ్రీనివాస్ కుమార్, కార్యదర్శి పూడి శ్రీనివాస్, బట్టిప్రోలు శ్రీనివాస్, సోగ్గాడు ప్రసాద్ తదితరులు మాట్లాడుతూ తన విలక్షణ నటనతో ప్రేక్షకుల మదిలో చిరస్థాయిగా నిలిచిన నటుడు శోభన్ బాబు అన్నారు. కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా గోపూజ

కడియం: గోమాతను పూజించడం సకల దేవతారాధనతో సమానమని గోశాల సంరక్షణ సమితి అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి గిరజాల బాబు అన్నారు. కనుమ పంగను పురస్కరించుకుని కడియంలోని భ్రమరాంబికా సమేత మల్లేశ్వర స్వామి ఆలయంలో గల గోశాలలో పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గిరజాల వీర్రాజు, రామకృష్ణ తులసి దంపతులతో అర్చకుడు అప్పిలి శ్రీమన్నారాయణ (చిన దేవుడు) శాస్త్రోక్తంగా ఈ కార్యక్రమం జరిపారు. బాబు మాట్లాడుతూ వ్యవసాయంలో రైతులకు సహకరించే పశువులను పూజించడం కనుమ పండగ విశిష్టత అన్నారు.